## డిజిటల్ స్క్రీన్‌పై ఎన్నికల ఫలితాల ప్రదర్శన



డిజిటల్ స్క్రీన్‌పై ఫలితాలు వీక్షిస్తున్న బాటసారులు

కలెక్టరేట్, జూన్ 4 : లోక్‌సభ ఎన్నికల ఫలితాలను కలెక్టరేట్ ఎదుట డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించగా, బాటసారులు ఆసక్తి వీక్షించారు. లెక్కింపు కేంద్రాలతో పాటు కలెక్టరేట్ల ఎదుట కూడా ఫలితాల లైవ్ ప్రదర్శించాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు ఆదిశగా ఏర్పాట్లు చేశారు. లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి మొదలు పూర్తయ్యేవరకు స్క్రీన్‌పై లైవ్ ప్రసారం చేయడంతో కలెక్టరేట్ ఎదుట నుంచి వెళ్లే పలువురు ఆగి, ఫలితాలను ఆసక్తిగా తిలకించారు.

## హత్యకేసు నిందితుల అరెస్ట్

రాంనగర్, జూన్ 4 : మానకొండూర్ మండలం ఊటూర్ గ్రామంలో గత నెలలో జరిగిన ప్రశాంత్‌రెడ్డి హత్యకేసులో నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన గోపు ప్రశాంత్‌రెడ్డి అనే యువకున్ని గతనెల 28న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి ఆపై హత్య చేసి సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మానేరు వాగులో పడేశారు. ఈ ఘటనపై ముందుగా కిడ్నాప్ కేసుగా నమోదు చేసిన పోలీసులు సాయంత్రానికి మృత దేహం లభ్యం కావడంతో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంపులుగా వచ్చిన యువకులు ఊటూర్‌లో తలదాచుకున్న ప్రశాంత్‌రెడ్డిని కిడ్నాప్ చేసి దాడి చేసి కొట్టడమే కాక గ్రామస్తుల ముందే ఎత్తుకెళ్లడంతో సంచలనంగా మారింది. దీనిపై పలు కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో నిందితులు పట్టుబడడంతో వారిని విచారించిన పోలీసులు ఘటనా స్థలంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి పూర్తి సమాచారాన్ని సేకరించారు. పచ్చునూర్ గ్రామానికి చెందిన నన్నవేని రమేశ్ అలియాస్ జానిభాయ్ (39) ప్రధాన నిందితుడిగా గుర్తించి అతడికి సహకరించిన 16 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగళవారం రమేశ్‌తో పాటు అంతడ్పుల సాయికృష్ణ అలియాస్ ఎస్‌కే భాయ్ (26), తాండ్ర మహేశ్ అలియాస్ చిన్నమహేందర్ (26), కూరాకుల అనిల్ (29), సర్దార్ కుల్‌దీప్‌సింగ్ అలియాస్ కార్తీక్ (31), పొన్నాల మనోహర్ (34), ఇరుకొండ మహేశ్ (25), కొమ్మడవేని హరీశ్ (25), వొడ్నాల యజ్ఞేష్ (28)ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మానకొండూర్ సీఐ మాదాసు రాజ్‌కుమార్ తెలిపారు.

## నగర రోడ్లు వెలవెల

కార్పొరేషన్, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కరీంనగరంలోని రోడ్లన్నీ మంగళవారం ఉదయం నుంచే జనసంచారం తగ్గి వెలవెలబోయాయి. దేశంలో ఏ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్న ఆసక్తితో నగరవాసులు అత్యధికం సాయంత్రం వరకు ఇండ్లలో టీవీల ముందే కూర్చుండి పోయారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై సైతం అప్రకటికత కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఓట్ల లెక్కింపు జరుగుతున్న ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో మాత్రం వివిధ పార్టీల కార్యకర్తలు, అభిమానుల సందడి నెలకొన్నది.


మక్త శివారులో పొలంలో రైతులు తగులబెట్టిన కొయ్యకాళ్లు(ఫైల్)

# కాల్చితే కాలుష్యం.. కలియదున్నితే భూసారం

రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగవుతుండగా, కోతల అనంతరం చాలా మంది రైతులు కొయ్యకాళ్లకు నిప్పంటించి తగులబెట్టడం సర్వసాధారణంగా మారింది. ఫలితంగా వాతావరణంలో కాలుష్యం పెరిగిపోవడమే కాక, భూమి వేడెక్కి సూక్ష్మజీవులు నశించి, నిర్జీవంగా మారుతున్నది. అశాస్త్రీయమైన ఈ పద్ధతితో వ్యవసాయం 20 ఏండ్లు వెనుకబడి పోతుందని వ్యవసాయ నిపుణులు, అధికారులు పదే పదే చెబుతున్నా రైతులు పెడ చెవిన పెడుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పద్ధతి 'మల్చర్'పై దృష్టి సారిస్తే వ్యర్థంగా భావించే కొయ్యకాళ్లను ఎరువుగా మార్చుకునే అవకాశం ఉంది.

*- శంకరపట్నం, జూన్ 4*

- కొయ్యకాళ్లపై వ్యవసాయ అధికారుల విస్తృత ప్రచారం
- ఒకసారి తగులబెడితే 20 ఏండ్లు వెనుకకు వ్యవసాయం
- 'మల్చర్'తో కొయ్యకాళ్ల తొలగింపు సులభం
- ఎరువుగా మార్చుకునే అవకాశం

ప్రస్తుత కాలంలో రైతులంతా హార్వెస్టర్లతో వరికోతలు చేపడుతున్నారు. ఈ యంత్రం 30 సెంమీ పొడవుతో కొయ్యకాళ్లను విడిచి వరి కోస్తుంది. ఇలా విడిచిన కొయ్యకాళ్లను సాధారణంగా రైతులు కాల్చి వేస్తున్నారు. దీంతో వెలువడే పొగతో ఓవైపు వాతావరణంలో కాలుష్యం పెరుగుతుండగా, మరోవైపు పొలంలో పంటలకు మేలు చేసే బ్యాక్టీరియా, తదితర సూక్ష్మజీవులు సైతం నశిస్తుంటాయి. దీంతో భూసారం తగ్గి పంటల దిగుబడి గణనీయంగా పడిపోతుంది. ఇక కాల్చే సమయంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగడం, తీవ్ర ప్రమాదాలకు దారి తీసిన సందర్భాలు కూడా చూస్తుంటాం.

### ప్రత్యామ్నాయం.. సులువైన పరిష్కారం

రైతులు వరి కొయ్యలను కాల్చేబదులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. మల్చర్ విధానంలో మల్చర్ (గడ్డి కప్పు యంత్రం)తో సులువుగా కొయ్యకాళ్ల సమస్యను అధిగమించవచ్చు. ఈ యంత్రంతో గడ్డిని చిన్న చిన్న ముక్కలుగా చేయవచ్చు. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించి కొయ్యకాళ్లను తొలగించవచ్చు. ఈ యంత్ర పరికరంలో గేర్ బాక్స్, రోటర్‌తో పాటు కత్తులతో కట్ చేసిన గడ్డిని సమాంతరంగా నేలపై పరుచుటకు రోలర్‌తో అమర్చబడి ఉంటుంది. పరికరాన్ని సులువుగా ట్రాక్టర్ త్రీ పాయింట్ లింకేజీ మీద అమర్చుకోవచ్చు. ట్రాక్టర్ పీటీవో ద్వారా శక్తిని తీసుకొని మల్చర్ పని చేస్తుంది.

### 'మల్చర్'తో బహుళ ప్రయోజనాలు

మల్చర్ పరికరం కొయ్యకాళ్ల గడ్డిని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి నేలపై సమాంతరంగా పరుస్తుంది. దీన్ని నీటి తడి పెట్టి అలాగే వారం, పది రోజుల పాటు మురగనివ్వాలి. తర్వాత దున్నితే ముక్కలుగా మారిన గడ్డి నేలలో కలిసిపోతుంది. దీంతో నేలలో తేమ శాతం పెరుగుతుంది. నేల సారవంతం అవుతుంది. నీటి కోతను తగ్గించుకోవచ్చు. పొలంలో మిత్ర జీవులను కాపాడుకోవచ్చు. ఎరువుగా మార్చుకోవచ్చు. ఎరువులు చల్లే సమయంలో సూక్ష్మజీవులు ఎరువులతో చర్య జరిపి పైరు ఎదుగుదలకు దోహదపడుతుంది. దీంతో పంటల దిగుబడి పెంచుకోవడమే కాక వాతావరణంలో కాలుష్యాన్ని సైతం నియంత్రించుకోవచ్చు.


మల్చర్‌తో కొయ్యకాళ్లను పొలంలో కలియదున్నుతున్న రైతు

### దిగుబడి అనూహ్యంగా పెరుగుతుంది



కొయ్యకాళ్లను తగులబెట్టడం పురాతనమైన, అశాస్త్రీయ పద్ధతి.. ఇది వ్యవసాయానికి చేటు చేసే పద్ధతి.. వాతావరణంలో కాలుష్యం పెంచుతుంది.. ఒక్కసారి కొయ్యకాళ్లను కాలిస్తే వ్యవసాయం 20 ఏండ్లు వెనుకబడ్డట్లే.. మట్టిలో కోటానుకోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి.. ఇందులో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా ఉంటాయి.. కొయ్యకాళ్లను తగులబెట్టినప్పుడు ఇవన్నీ చచ్చిపోతాయి.. దీంతో భూమి సారం కోల్పోతుంది. ఈ విధానం సరికాదని శాస్త్రవేత్తలు సైతం తేల్చారు. మల్చర్‌తో ఈ సమస్యకు చక్కని పరిష్కారం దొరికింది. రోటోవేటర్‌తో దున్నే యంత్ర పరికరం ఇది.. ఇది కొయ్యకాళ్లను చిన్న చిన్న ముక్కలుగా, పౌడర్‌గా మారుస్తుంది. తర్వాత రెండు బస్తాలు సూపర్ పాస్ఫేట్ వేసి దున్నితే భూమి సారవంతంగా మారుతుంది. దీంతో ఎకరాకు 10 ట్రాక్టర్ల మట్టి వేసినట్లు అవుతుంది.. భూసారంతో పాటు పంట దిగుబడి కూడా అనూహ్యంగా పెరుగుతుంది.

*-ఆర్ శ్రీనివాస్, ఎంఏవో, శంకరపట్నం*

## జిల్లా జైలును సందర్శించిన ప్రధాన న్యాయమూర్తి


జిల్లా జైలును పరిశీలిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

రాంనగర్, జూన్ 4: కరీంనగర్ జిల్లా జైలును మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమా సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత జైలులో క్యాంటీన్, జైలు హాస్పిటల్, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ నిర్వహణపై అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ, ఎంతో మంది క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వస్తున్నారని, జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత కొత్త జీవితం ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు. మహిళా జైలును కూడా సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మహిళా ఖైదీలతో మాట్లాడారు. వారి కేసు వివరాలు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేట్ లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్, పర్యవేక్షణ అధికారి కే శ్రీనివాస్, వైద్యాధికారి కే వేణుగోపాల్, జైలర్ శ్రీనివాస్, రమేశ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంగీత, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేశ్, గార్డింగ్ సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

## సివిల్ ఇంజినీరింగ్‌తో మంచి భవిష్యత్


మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ శంకర్

హుజూరాబాద్ రూరల్, జూన్ 4: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, పోటీ ప్రపంచంలో పుష్కలమైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శంకర్ మాట్లాడుతూ, ఉద్యోగంలో చేరే సివిల్ ఇంజినీర్లకు కొత్తలో కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తే జీవితంలో స్థిర పడవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, కళాశాల రిజిస్ట్రార్, హ్యూమానిటీస్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వీ రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఎం అనిల్, డాక్టర్ యోగేష్ పుండలిక్, డాక్టర్ సతీశ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ రావు, అకాడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ జీ మల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రేణుల సంబురాలు

శంకరపట్నం/ వీణవంక, జూన్ 4: కరీంనగర్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడిగా బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ గెలుపుపై మంగళవారం ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి, స్వీట్లు పంచి సంతోషాన్ని ప్రకటించారు. శంకరపట్నంలో బీజేపీ నాయకులు మాడ వెంకట్‌రెడ్డి, నరేందర్, అశోక్, రాజిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మి, వీణవంకలో నాయకులు మడుగూరి సమ్మిరెడ్డి, పోతరవేన శ్రీనివాస్, దాసారపు రాజు, కూచనపల్లి రాకేశ్, కంకల సంతోష్, సింగిరెడ్డి సందీప్‌రెడ్డి, ప్రభాకర్, దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ముమ్మరం

చిగురుమామిడి, జూన్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. చిగురుమామిడి, ముల్కనూరు, రేకొండ, సుందరగిరి, కొండాపూర్, ఇందుర్తి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను ఊడ్చి శుభ్రం చేసి, చెత్తను గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డ్‌కు తరలించారు. మురుగు కాలువలు శుభ్రం చేసి అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

## మంత్రి పొన్నం పరామర్శ


దవాఖానలో శ్రీనివాస్ గౌడ్‌ను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యానగర్, జూన్ 4 : హుస్నాబాద్ నియోజకవర్గంలోని కురెళ్ల గ్రామానికి జాగిరి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల తాటిచెట్టు నుంచి కిందపడ్డాడు. రెండు కాళ్లు విరగడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. విషయం తెలియడంతో మంగళవారం రాత్రి శ్రీనివాస్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పరామర్శించారు. అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం వైద్యులకు ఫోన్ చేసి.. మెరుగైన వైద్యం అందించాలని, ఆపరేషన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.


పోస్టల్ ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి


ఎస్సారార్ కళాశాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
- కలెక్టర్ పమేలా సత్పతి


కౌంటింగ్ హాల్‌లో ఈవీఎంలలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టరేట్, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలకు కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజవుగా పూర్తయిందని పేర్కొన్నారు. ఎలాంటి అవాంతరాలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతో కష్టపడి పని చేసిన పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బందిని అభినందించారు. ఎన్నికల నిర్వహణ కోసం ముందు జాగ్రత్తగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### ఓట్ల లెక్కింపును పరిశీలించిన ఆర్‌వో

నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం చేపట్టిన ఓట్ల లెక్కింపును కరీంనగర్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల లెక్కింపు హాళ్లను ఆమె సందర్శించారు. ఉదయం ఎనిమిది గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రారంభించగా, ఈ ప్రక్రియను ఆర్‌వో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అంతకుముందు ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ చేసి, టేబుళ్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఏడు సెగ్మెంట్లకు సంబంధించి లెక్కింపు కేంద్రాల వారీగా సిబ్బందికి విధులు అప్పగించినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లెక్కింపులో ఎలాంటి జాప్యం జరుగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎనిమిదిన్నర గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అప్రమత్తంగా విధులు నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశారు. పారదర్శకంగా ఓట్ల లెక్కింపు కొనసాగించాలన్నారు. లెక్కింపు పర్యవేక్షణలో ఆర్‌వోతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా, లెక్కింపు పరిశీలకురాలు జి.నజ్మా, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రామ్మూర్తి, రాజేశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# లారీల అడ్డదారులు

- టోల్ రుసుము తప్పించుకునేందుకు పల్లెల మీదుగా పెరుగుతున్న రాకపోకలు
- గ్రామాల్లో తరచూ ప్రమాదాలు.. భయాందోళనలో గ్రామీణులు
- పట్టింపు లేని హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా నిర్వాహకులు

*రాజీవ్ రహదారి వెంబడి ఉన్న టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు లారీలు అడ్డదారులు పడుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో పల్లెల మీదుగా వేగంగా సింగిల్ రోడ్లపై దూసుకెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా యాజమాన్యం, సిబ్బంది పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.*

*- తిమ్మాపూర్, జూన్ 4*

తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై హెచ్‌కేఆర్ సంస్థ టోల్‌ప్లాజా ఉన్నది. హైదరాబాద్ – కరీంనగర్ వైపుగా అటూ ఇటూ వెళ్లే వాహనాలు తప్పనిసరిగా టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే చాలా వాహనాలు ముఖ్యంగా పెద్ద లారీలు, రుసుము తప్పించుకునేందుకు రేణికుంట స్టేజీ నుంచి గొల్లపల్లి, నేదునూర్, లక్ష్మీదేవిపల్లి మీదుగా గుండ్లపల్లికి చేరుకుని అక్కడి నుంచి తిరిగి రాజీవ్ రహదారి పైకి చేరుకుంటున్నాయి. రహదారి మీదుగా నేరుగా వెళ్లి తిరిగి వచ్చే పెద్ద లారీలు టోల్‌ప్లాజాలో రూ.750 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుసుం తప్పించుకునేందుకు లారీలతోపాటు కార్లు, ఇతర వాహనాలు ఆయా గ్రామాల వెంట వెళ్తుంటాయి.

### తరచూ ప్రమాదాలు.. గ్రామీణులకు ఇబ్బందులు

టోల్ రుసుం తప్పించుకోవడానికి లారీలు గ్రామాల మీదుగా సింగిల్ రోడ్డుపై వెళ్తుండగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ముందు లారీ వెళ్తే మరే వాహనమైనా సైడ్ దొరుకక వెనుకాలే ప్రయాణించాల్సి వస్తున్నది. దీంతో గ్రామాలకు వెళ్లే వాహదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల మీదుగా వెళ్తున్న క్రమంలో లారీల వల్ల పలు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. వారం క్రితం టోల్ తప్పించుకునేందుకు వెళ్లిన లారీ గొల్లపల్లి గ్రామం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పదుల సంఖ్యలో టీవీలు పాడైపోయాయి. అలాగే ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కారును అడ్డదారిన వస్తున్న లారీ ఢీకొట్టడంతో కారు ధ్వంసంకాగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. లారీలు టోల్ రుసుము తప్పించుకునేందుకు గ్రామాల వెంట వెళ్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నా.. టోల్ ప్లాజా యాజామాన్యం చోద్యం చూస్తున్నది. లారీలు ఇతర మార్గాల వెంట వెళ్లకుండా కట్టడి చేయలేకపోతున్నారు. వారి ఆదాయానికి గండి పడడం దేవుడెరుగు.. కానీ ప్రజల ప్రాణాలతో లారీలు, టోల్ ప్లాజా నిర్వాహకులు చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రేణికుంట వద్ద మాజీ ఎమ్మెల్యే కారును ఢీ కొట్టిన లారీ (ఫైల్)


గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ (ఫైల్)

### లారీలను కట్టడి చేయాలి



గతంలో లారీలు రాత్రి సమయంలో మాత్రమే మా ఊరి మీదికెళ్లి పోయేవి. రాత్రి కాబట్టి ఇబ్బందులేం ఉండకపోవు. కానీ ఇప్పుడు పగలు కూడా పోతున్నాయి. దీంతో మా గ్రామస్తులకే కాకుండా ఇతర గ్రామాల ప్రజలకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నయ్. అలాగే పలు ప్రమాదాలు కూడా జరిగినయ్. అయినా టోల్‌ప్లాజా యాజమాన్యం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. మా గ్రామం మీదుగా లారీలు, ఇతర వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.

*–మల్లెత్తుల అంజయ్య, గొల్లపల్లి మాజీ సర్పంచ్*

## విద్యుత్ సమస్యలపై సంప్రదించాలి

హుజూరాబాద్ రూరల్, జూన్ 4: హుజూరాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఏర్పడిన సందర్భంలో సిబ్బందిని సంప్రదించేందుకు వినియోగదారుల కోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీఈ లక్ష్మీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్ల వారీగా ఎఫ్‌వోసీ, ఏఈల ఫోన్ నంబర్లలో సంప్రదించి తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

| సెక్షన్ | ఎఫ్‌వోసీ నంబర్ | ఏఈ ఫోన్ నంబర్ |
|---|---|---|
| హుజూరాబాద్ టౌన్ | 9491075402 | 944081145 |
| హుజూరాబాద్ రూరల్ | 9491074659 | 9440811452 |
| పెద్దపాపయ్యపల్లి | 9491074658 | 850012022 |
| తాడికల్ | 9491075204 | 9440811454 |
| ఆముదాలపల్లి | 9491075206 | 8333923879 |
| సైదాపూర్ | 9491075199 | 9440811461 |
| జమ్మికుంట టౌన్ | 9493584139 | 9440811455 |
| జమ్మికుంట రూరల్ | 9491074661 | 9440811456 |
| ఇల్లందకుంట | 7901097141 | 9491058669 |
| తనుగుల | 9491075215 | 8500120105 |
| వీణవంక | 9491075373 | 9440811457 |
| చల్లూరు | 9491075213 | 8333923880 |

## టిప్పర్, ఎక్స్‌కవేటర్ పట్టివేత

సారంగాపూర్, జూన్ 4: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామ శివారులోని గోదావరి నది నుంచి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఏఎస్ఐ గజేందర్ తెలిపారు. టిప్పర్‌తో పాటు ఇసుకను నింపేందుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-AII

CHANGE OF NAME

★ I SUDHEER KUMAR.M s/o: MEKALA ODELU, R/o: H.No. 1-85/1, Potharam Village, Mutharam Manthani mandal, Peddapalli dist, Telangana state, corrected as my father name MEKALA ODELU @ ODELU MEKALA in place of ODELU, for all purpose.
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194